www.prajasakti.com

ప్రజాశక్తి

మంగళవారం 17 జూన్ 2025

5

డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ

50 శాతం రాయితీపై దాణా పంపిణీ

ప్రజాశక్తి - రావులపాలెం

పాడి రైతులకు 50 శాతం రాయితీపై పశువులకు దాణాను అందిస్తున్నట్లు పశువైద్య సహాయ సంచాలకులు ఎస్.ఉమామహేశ్వర రెడ్డి తెలిపారు. సోమవారం స్థానిక పశువైద్యశాలలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబు పాడి పరిశ్రమను అభివృద్ధి చేసేందుకు అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టారని అన్నారు. చిన్న, సన్నకారు రైతులకు పశువులు పెంచడానికి అవసరమైన దాణాను రాయితీపై అందించనున్నట్లు తెలిపారు. 50 కేజీల బస్తాను కేవలం రూ.550కే ప్రభుత్వం అందజేస్తుందన్నారు. రావులపాలెం, ఆత్రేయపురం మండలాల్లో తెల్ల రేషన్ కార్డు కలిగిన పసుపు పెంపకం దారులు సమీప పశువైద్యశాలలో గాని, రైతు సేవా కేంద్రంలో గాని తమ పేర్లను నమోదు చేసుకోవాలని ఆయన సూచించారు.

బడి బస్సు భద్రమేనా..?

- జిల్లాలో 1 035 వాహనాలు
- ఫిట్‌నెస్ పొందినవి 985
- విద్యార్థుల రక్షణే కీలకం

ప్రజాశక్తి - రాజోలు

ప్రయివేటు పాఠశాలలు, కళాశాలల్లో బస్సుల వినియోగం పెరిగింది. జిల్లాలో వివిధ రకాల ప్రయివేట్ విద్యా సంస్థలు 580 వరకు ఉన్నాయి. ఈ నెల 12వ తేదీ నుంచి నూతన విద్యా సంవత్సరం ప్రారంభం అయింది. ప్రయివేటు పాఠశాలల విద్యార్థులు అధిక శాతం మంది బస్సుల్లోనే ప్రయాణిస్తున్నారు. బస్సు సామర్థ్యం సరిగా లేకుంటే ప్రమాదాలు జరిగే అవకాశముంది. ఫలితంగా విద్యార్థుల ప్రాణాలకు ముప్పు పొంచివుంది. అందుకే ఏటా మోటార్ వెహికల్ తనిఖీ అధికారులు బస్సు కండిషన్ చెక్ చేసి ఫిట్నెస్ సర్టిఫికెట్ జారీ చేస్తుంటారు. గతేడాది జారీ చేసిన ఫిట్నెస్ సర్టిఫికెట్ గడువు గత నెల 14తో ముగియడంతో, గత నెల 15 నుంచి కొత్తగా ఫిటెనెస్ సర్టిఫికెట్ల జారీ ప్రారంభమైంది. విద్యార్థులను సురక్షితంగా ఇంటి నుంచి పాఠశాలలకు, పాఠశాల నుంచి ఇంటికి చేరవేసే వాహనాల సామర్థ్యం(ఫిట్నెస్) ఎలా ఉంది? అన్న విషయాన్ని తేల్చే పనిని రవాణాశాఖ అధికారులు చేపట్టారు. మొత్తం 1035 బస్సులకు గాను 985 బస్సులకు ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు ఇచ్చారు. మరో 50 బస్సులకు ఫిట్‌నెస్ పరీక్షలు నిర్వహించాల్సి ఉంది. అయితే కొన్ని ప్రాంతాల్లో ఇంధన శకట తనిఖీ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. బస్సుల కండిషన్ బాగోలేకపోయినా ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు ఇస్తున్నారనే విమర్శలు లేకపోలేదు. దీనివల్ల ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. నిబంధనల ప్రకారం ప్రతి మూడు నెలలకోసారి వెహికల్ ఇన్‌స్పెక్టర్ పాఠశాలలకు వెళ్లి బస్సుల సామర్థ్యం పరీక్షించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

ఎఫ్‌సి లేకపోతే ఉపేక్షించం

మోటార్ వాహనాల నిబంధనలు పాటించని పాఠశాల, కళాశాలల బస్సులను సీజ్ చేస్తాం. పాఠశాలలు తెరిచిన నాటి నుంచి ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తాం. గడువు ముగిసిన తర్వాత ఎఫ్‌సి, పర్మిట్, కండిషన్ లేని బస్సులను సీజ్ చేస్తాం. ఫిట్‌నెస్ సర్టిఫికెట్ లేకుండా స్కూళ్లు, కళాశాలల బస్సులు రోడ్లపై తిరిగితే ఉపేక్షించేది లేదు. కచ్చితంగా ఫిట్‌నెస్ సర్టిఫికెట్ పొందిన తరువాతే బస్సు నడపాలి.

- డి.శ్రీనివాసరావు, ఆర్‌టిఒ, డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా.

- ఇవీ నిబంధనలు..!

పాఠశాలల, కళాశాలల బస్సులు రోడ్డుపై తిరగాలంటే రవాణా శాఖ నిబంధనలు పాటించాలి. సీట్లు శుభ్రంగా ఉండాలి. 60 ఏళ్లలోపు డ్రైవర్ మాత్రమే వాహనాన్ని నడపాలి. డ్రైవర్‌కు ఐదేళ్ల సీనియారిటీ తప్పనిసరి. బస్సుల కాల పరిమితి 15 ఏళ్లు మించరాదు. డోరు వద్ద బస్సు రెండు పక్కలా, బస్సు లోపల సెంటర్‌లో తప్పనిసరిగా అద్దాలు ఉండాలి. బస్సు లోపల ఫస్ట్ ఎయిడ్ బాక్స్ తప్పనిసరి. ప్రతి విద్యార్థికి సీట్లలో మాత్రమే కూర్చోబెట్టాలి. ఓవర్ లోడ్ ఉండకూడదు. తప్పనిసరిగా బస్సులో అటెండర్ ఉండాలి. అతనితోపాటుగా ఒక టీచర్ ప్రయాణించాలి. విద్యార్థుల పేరెంట్స్ రోజుకొకరు వాహనంలో ఉండాలి. డ్రైవర్ సీటు వెనుకాల డ్రైవర్ ఫొటోతో కూడిన బయోడేటా తప్పనిసరిగా ఉంచాలి.

నైపుణ్యమున్న డ్రైవర్లే కీలకం..!

పాఠశాలల బస్సులు నడిపేవారు 60 ఏళ్లలోపు వారు అయి ఉండాలి. అయిదేళ్లు భారీ వాహనాలు నడిపిన అనుభవం ఉండాలి. షుగర్, దృష్టి సంబంధిత సమస్యలపై ఎప్పటికప్పుడు రికార్డు నిర్వహించాలి. డ్రైవర్ నియామకానికి పాఠశాలలోని తల్లిదండ్రుల కమిటీకి సమాచారం ఇవ్వాలి. విద్యాసంస్థ పేరు, చిరునామా, ఫోన్ నంబర్లు బస్సుకు ఎడమ వైపు ముందుభాగంలో స్పష్టంగా కనిపించేలా ఉండాలి. బస్సు కండిషన్తో పాటు బ్రేక్ వేసేటప్పుడు నాలుగువైపులా లైట్లు వెలగాలి. ప్రధాన, సిగ్నల్‌లైట్లు సక్రమంగా వెలుగుతుండాలి. ఎక్కేందుకు వీలుగా మెట్లు.. చేతులు బయట పెట్టకుండా కిటికీలకు ఇనుప జాలీ ఉండాలి. ఏదైనా ప్రమాదం జరిగినప్పుడు మంటలు ఆర్పేందుకు ముందు జాగ్రత్తగా అగ్నిమాపక పరికరాలన్నీ బస్సులో ఉంచాలి. అత్యవసర నిష్క్రమణ ద్వారం ఉండాలి. దీన్ని పెద్ద అక్షరాలతో కనిపించే విధంగా రాయాలి. ప్రథమ చికిత్స కిట్లు అందుబాటులో ఉంచి ప్రతి వారం విద్యాసంస్థల ప్రతినిధులు తనిఖీ చేసి మార్చుకోవాలి. రివర్ వ్యూ మిర్రర్ తోపాటు బస్సు లోపల మొత్తం కనిపించేలా డ్రైవర్ ముందు భాగంలో అద్దం ఉండాలి

వికలాంగులకు మోటార్ సైకిల్ పంపిణీ చేస్తున్న మంత్రి సుభాష్

వికలాంగులకు ఉపకరణాల పంపిణీ

ప్రజాశక్తి - రామచంద్రపురం

ఆర్టిఫిషియల్ లింబ్స్ మాన్యుఫ్యాక్చరింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా, అలింకో ద్వారా ఏర్పాటుచేసిన కృత్రిమ ఉపకరణాలను కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ చేతుల మీదుగా సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలో 290 మంది దివ్యాంగులకు సుమారు రూ.86 లక్షలతో 554 కృత్రిమ ఉపకరణాలను అందజేసినట్లు తెలిపారు. ప్రభుత్వ రంగ సంస్థ ఆలింకో భారత ప్రభుత్వంలోని సామాజిక న్యాయం, సాధికారత మంత్రిత్వ శాఖలోని దివ్యాంగుల సాధికారత సంక్షేమం కోసం పనిచేస్తుందన్నారు. కృత్రిమ అవయవాలు ఉపకరణాలు వాటి భాగాల లభ్యత, వినియోగం, సరఫరా పంపిణీని ప్రోత్సహిస్తుం దన్నారు. ఆర్థోపెడిక్, దృష్టి, వినికిడి లోపం, మేధో వైకల్యం గల వికలాంగుల ఆరోగ్య సంరక్షణ కొరకు పరికరాలు వ్యక్తిగత రక్షణ కిట్లు ఉచితంగా అందిస్తుందన్నారు. వికలాంగుల రక్షణ సిబ్బంది, ఆసుపత్రులు ఇతర సంక్షేమ సంస్థలకు చేయూత నందిస్తుందన్నారు పిల్లలు, మహిళలు, వృద్ధులు వికలాంగులకు తగిన శిక్షణ ఇస్తుందని, గత ఏడాది నవంబర్ 4న ఆలింకో సంస్థ వికలాంగులకు వైద్య పరీక్షలు నిర్వహించి వికలాంగత్వ లోపాలను శాస్త్రీయపరంగా గుర్తించి అర్హులైన వారికి కృత్రిమ అవయవాలు పంపిణీకి చర్యలు చేపట్టిందన్నారు. కృత్రిమ అవయవాల పంపిణీకై జిల్లాకు రూ.4 కోట్లు సంస్థ కేటాయించిందని తెలిపారు. ఇందులో రామచంద్రపురం నియోజకవర్గానికి రూ.86 లక్షలు వెచ్చించినట్లు వివరించారు. బ్యాటరీ ఆపరేటర్ మోటార్ సైకిల్లు 68, ట్రై సైకిళ్లు 41, వీల్ చైర్లు 62, నడక కర్రలు 30, అత్యధిక డిజిటల్ వినికిడి యంత్రాలు బ్యాటరీలతో సహా 22 మందికి ఉచితంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలింకో సంస్థ డిప్యూటీ జనరల్ మేనేజర్ సంజయ్‌సింగ్, పిఠ రవిశంకర్, శివాసిస్‌పట్నాయక్, జడ్‌పి సిఇఒ వివివిఎస్.లక్ష్మణరావు, టిడిపి సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యం, జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ పోలిశెట్టి చంద్రశేఖర్, మున్సిపల్ ఛైర్‌పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి, ఎంపిపి అంబటి భవాని, ఎంపిడిఒ పద్మజ్యోతి, ఎన్.శ్రీనివాసు, పి.రాంబాబు పాల్గొన్నారు.

స్థానిక మండలాల్లో పోస్టింగ్ ఇవ్వాలని వినతి

ప్రజాశక్తి - ఆత్రేయపురం, ఆలమూరు

మండలంలోని వాడపల్లిలో నిర్వహించిన యోగాంధ్రా కార్యక్రమానికి వచ్చిన ఎంఎల్ఎను పలువురు సచివాలయ ఉద్యోగులు కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. జిఒ నెంబర్ 5 ప్రకారం సచివాలయ ఉద్యోగులకు సొంత మండలంలో కాకుండా వేరే మండలాల్లో పోస్టింగ్ ఇస్తున్నారని అన్నారు. తక్కువ జీతంతో పనిచేసే సచివాలయ ఉద్యోగులు వేరే మండలాల్లో విధులు నిర్వర్తించాలంటే ఆర్థికంగా ఇబ్బందులు పడతామని అన్నారు. పైగా సొంత మండలంలో అయితే ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు అవకాశం ఉంటుందన్నారు. కావున ఉద్యోగుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని స్థానిక మండలాలకే పోస్టింగ్ ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే ఎంపిడిఒ ఎ.రాజు సమక్షంలో ఆలమూరు మండలానికి చెందిన పలువురు సచివాలయ ఉద్యోగులు ఎంఎల్ఎ బండారు సత్యానందరావును కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సొంత మండలంలో ఉంటున్న వారికి ఇతర మండలాలకు బదిలీ చేస్తున్నారని, దీనివల్ల తమ కుటుంబాలు ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉందన్నారు. కావున సొంత మండలంలోనే పోస్టింగు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

ఎంఎల్ఎతో మాట్లాడుతున్న సచివాలయ ఉద్యోగులు

బ్రాందీ షాపును నిరసిస్తూ మహిళల ధర్నా

ప్రజాశక్తి - మామిడికుదురు

బ్రాందీషాపు వద్ద ధర్నా చేస్తున్న గ్రామస్తులు

పెదపట్నంలో ఏటిగట్టు ఆంజనేయస్వామి ఆలయం ఎదురుగా బ్రాందీ షాపు ఏర్పాటుతో సోమవారం మహిళలు నిరసన వ్యక్తం చేస్తూ ధర్నా నిర్వహించారు. గతంలో ఇక్కడ బ్రాందీ షాపు ఏర్పాటును అడ్డుకోగా అప్పట్లో ఈ షాపును వేరే చోటకు తరలించారు. తిరిగి అదే ప్రాంతంలో బ్రాందీ షాపు ఏర్పాటుకు ప్రయత్నాలు జరుగుతుండటంతో మహిళలు ఆందోళనకు దిగారు. షాపు ఏర్పాటును నిలుపుదల చేయకపోవడంతో ఆందోళన ఉధృతం చేస్తామన్నారు. ఈ నిరసన కార్యక్రమంలో కుక్కల వేణు, చెల్లింగి సత్యనారాయణ, సక్కుభాయి, కుక్కల నాగలక్ష్మి, అరిగెల కృష్ణవేణి, చెల్లింగి వరలక్ష్మి పాల్గొన్నారు.

శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎంఎల్ఎ బండారు

గ్రామీణ ప్రాంతాల అభివృద్ధే లక్ష్యం: ఎంఎల్ఎ

ప్రజాశక్తి - ఆత్రేయపురం

గ్రామీణ ప్రాంతాల అభివృద్ధే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పాలన సాగిస్తుందని ఎంఎల్ఎ బండారు సత్యానందరావు అన్నారు. సోమవారం ఆత్రేయపురంలో సర్పంచ్ గడ్డం సుధా అధ్యక్షతన పలు అభివృద్ధి కార్యక్రమాలకు ఆయన శంకుస్థాపన చేశారు. పోస్ట్ ఆఫీస్ నుంచి బండారు కాలనీకి వరకు రూ.20.65లక్షల వ్యయంతో సిసి రోడ్డు నిర్మాణానికి ఆయన భూమిపూజ చేశారు. అనంతరం రజకపేటలో 40 వేల లీటర్ల కెపాసిటీతో రూ.77లక్షలతో నిర్మించనున్న వాటర్ ట్యాంక్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. బండారు కాలనీలో 60 వేల లీటర్ల కెపాసిటీతో రూ.84 లక్షల వ్యయంతో నిర్మించనున్న వాటర్ ట్యాంక్‌కు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలకు కట్టుబడి పని చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కరుటూరి నరసింహారావు, మండల టిడిపి అధ్యక్షులు కుసంపూడి బాబు, ముదునూరి వెంకటరాజు, కాయల జగన్నాథం, తోట రజిని, ఎంపిడిఒ బికెఎస్ఎస్.వెంకట్‌రామన్, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాల కోసం అంగన్‌వాడీల ధర్నా

అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం జిల్లావ్యాప్తంగా సిఐటియు ఆధ్వర్యంలో అంగన్‌వాడీలు ధర్నాలు నిర్వహించారు. రాష్ట్రవ్యాప్తంగా సిఐటియు ఇచ్చిన పిలుపులో భాగంగా జిల్లాలోని పలు మండలాల్లో తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఆయా మండల తహశీల్దార్లు, ఎంపిడిఒలకు అంగన్‌వాడీలు అందజేశారు.

ప్రజాశక్తి - యంత్రాంగం

అమలాపురం కలెక్టరేట్ వద్ద అంగన్‌వాడీలు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా అధ్యక్షురాలు బి. వెంకటలక్ష్మి మాట్లాడుతూ గౌరవ వేతనంతో బతుకుతున్న అంగన్‌వాడీలకు రూ.10 వేలు వేతనం దాటిం దనే నెపంతో ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు దూరం చేయడం దారుణమన్నారు. నిత్యాసర వస్తువుల ధరలు విపరీతంగా పెరుగుతున్న తరుణంలో రూ.11 వేలతో ఒక కుటుంబం ఎలా బ్రతుకుతుందని ప్రశ్నించారు. తక్షణమే గత ప్రభుత్వంలో ఇచ్చిన ఈ సర్క్యులర్‌ను రద్దు చేసి సంక్షేమ పథకాలు అందరికీ అమలు చేయాలని ఆమె విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు పి.అమూల్య, పార్వతి, లక్ష్మి, వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. **ముమ్మిడివరం** స్థానిక రెవెన్యూ కార్యాలయం వద్ద సిఐటియు ఆధ్వర్యంలో అంగన్‌వాడీలు ధర్నా నిర్వహించారు. ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యదర్శి ఎం.జయలక్ష్మి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు దుర్గాప్రసాద్ మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లో అంగన్‌వాడి కేంద్రాల ద్వారా అర్హులైన గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు విలువైన సేవలు అందిస్తున్న అంగన్‌వాడీల నిరుపేద కుటుంబాలకు చెందిన వారని, వారికి ప్రభుత్వం ఇచ్చే గౌరవ భృతి అరకొర మాత్రమేనని అన్నారు. అనంతరం తహశీల్దార్ ఎంవిఎస్. సుబ్బలక్ష్మికి డిమాండ్స్‌తో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో వీరవేణి, సుబ్బలక్ష్మి, బొక్కా బేబీసుజాత, పి.పద్మ, కె.ఆశాజ్యోతి, జె.మేరీస్వాతి, విజయదుర్గ, నాగలక్ష్మి పాల్గొన్నారు. **రామచంద్రపురం** స్థానిక రెవెన్యూ డివిజనల్ కార్యాలయం వద్ద అంగన్‌వాడీలు ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి నూకల బలరాం, అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శులు మేడిశెట్టి దుర్గమ్మ, డి.ఆదిలక్ష్మి మాట్లాడారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలు పెరగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం ఆర్‌డిఒ డి.అఖిల్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో సూర్యకుమారి, విఎల్.రత్నం, బిటిఎల్,మాణిక్యాంబ, వెంకటరత్నం, తదితరులు పాల్గొన్నారు. **కాట్రేనికోన** స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద అంగన్‌వాడీలు ధర్నా నిర్వహించారు. ఎంపిడిఒ వెంకటచలంకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ముమ్మిడివరం ప్రాజెక్ట్ అధ్యక్షురాలు ఎస్.దుర్గామహేశ్వరి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సెక్టర్ నాయకురాలు ధనలక్ష్మి, శ్రీదేవి, విజయకుమారి, అంగన్‌వాడీ కార్యకర్తలు శ్యామల, రాజ్యలక్ష్మి, మంగాదేవి, భవాని పాల్గొన్నారు. **మండపేట** స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద అంగన్‌వాడీలు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రాజెక్ట్ ప్రధాన కార్యదర్శి సిహెచ్.రాణి మాట్లాడారు. నిత్యాసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగిన నేపథ్యంలో రూ.11 వేలతో బతుకుతున్న అంగన్‌వాడీలకు ప్రభుత్వ పథకాలను నిలుపుదల చేయడం దారుణమన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు ఎం.సూర్యకుమారి, వజరం నాగలక్ష్మి, దుర్గ, దేవకి రామలక్ష్మి, విజయ్‌కుమారి, పాల్గొన్నారు. **కొత్తపేట** మండల రెవెన్యూ కార్యాలయం వద్ద అంగన్‌వాడీలు ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు గంగ్రోతు సత్యవేణి, యు.విజయ కుమారి, బండి దుర్గ, జి.కళారత్నం పాల్గొన్నారు.

అమలాపురంలో కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న అంగన్‌వాడీలు

కాట్రేనికోనలో తహశీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న అంగన్‌వాడీలు

ముమ్మిడివరంలో ధర్నా చేస్తున్న అంగన్‌వాడీలు

రామచంద్రపురంలో ఆర్‌డిఒకు వినతిపత్రం ఇస్తున్న అంగన్‌వాడీలు

సిఎం ఆదేశాలతో ఇంటి స్థలం అందజేత

ప్రజాశక్తి - అమలాపురం

ఇంటి పట్టాను అందిస్తున్న కలెక్టర్

స్థానిక గొల్ల గూడెంకి చెందిన రాజులపూడి ఆరుద్ర కుమార్తె సాయిలక్ష్మీ చంద్రకి ఇంటి స్థలాన్ని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ పంపిణీ చేశారు. గతంలో జరిగిన ఆస్తి తగాదాలతో ఆమెకు వెన్నెముక దెబ్బతిని చక్రాల కుర్చీకే పరిమిత అయింది. ఆమెకు కామనగరువులో 72 గజాల స్థలాన్ని కేటాయించి పట్టాను కలెక్టర్ సోమవారం అందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గతంలో వాళ్ల బంధువులతో జరిగిన తగాదాలు మూలంగా వికలాంగురాలిగా సాయిలక్ష్మిచంద్ర మారిందని అన్నారు. మే 31న కాట్రేనికోన మండలానికి వచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబును సాయిలక్ష్మీచంద్ర కలవడం జరిగిందని తెలిపారు. ఈ సందర్భంగా సిఎం చంద్రబాబు ఈ అమ్మాయికి ఉద్యోగం, ఇల్లు మంజూరు చేయాలని ఆదేశించారని, ఈ మేరకు సోమవారం ఇంటి స్థలాన్ని అందించడం జరిగిందన్నారు. రెవెన్యూ సిబ్బంది ఇంటి స్థల సరిహద్దులను నిర్ధారించి అప్పగించాలని ఆదేశించారు. త్వరలో ఉద్యోగం కూడా ఇప్పించడం జరుగుతుందని తెలిపారు. ఈ సందర్భంగా వికలాంగురాలు తల్లి ఆరుద్ర మాట్లాడుతూ ఆస్తి తగాదాలో వికలాంగురాలిగా మారిన తమ కుమార్తెకు సిఎంగా ప్రమాణ స్వీకారం చేసిన 3వ రోజునే రూ 5 లక్షలు పరిహారంగా అందించారని తెలిపారు. నేడు ఇంటి స్థలాన్ని అందించారని అందుకు ఆమె సిఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఒ రాజకుమారి, తాహశీల్దార్ అశోక్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

మలేరియాపై అవగాహనా ర్యాలీ

ప్రజాశక్తి - మామిడికుదురు

ప్రజలకు అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

మండలంలోని అదుర్రు శివారు మోరిపోలంలో మలేరియాపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. సోమవారం లోటుకుర్రు పిహెచ్‌సి ఆధ్వర్యంలో చేపట్టిన ఈ కార్యక్రమంలో దోమల ద్వారా వచ్చే వ్యాధులు, డెంగీ జ్వరాలపై అవగాహన కల్పించారు. దోమల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఇంట్లో కూలర్, ఫ్రిజ్ వెనుకాల నీళ్లు ఉండకుండా ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవాలని సూచించారు. ఇంటి పరిసర ప్రాంతాల్లో టైర్‌లు, ఖాళీ కొబ్బరి బొండాలు, నిరూపయోగం గా ఉన్న ప్లాస్టిక్ డబ్బాలలో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ లక్ష్మిలలిత, ఎంపిహెచ్ఎ(ఎం) కొమ్మూరి ఉమామహేశ్వరరావు, ఎఎన్ఎం వైకెడి.నాగలక్ష్మి, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

జాబ్ మేళాలో 78 మందికి ఉద్యోగాలు

ప్రజాశక్తి - రామచంద్రపురం

స్థానిక ఉపాధి కార్యాలయంలో సోమవారం నిర్వహించిన జాబ్ మేళాలో 78 మందికి ఉద్యోగాలు వచ్చాయని ఉపాధి ప్రాజెక్ట్ డైరెక్టర్ రామ్‌కుమార్ తెలిపారు. డిక్సన్ కంపెనీలో 11, టైచే కేస్టింగ్స్ ప్రయివేట్ లిమిటెడ్‌లో 8, మేడ్ ప్లస్‌లో 15, మెట్రో కేంలో 17 , డిమార్ట్ 5, ఎస్‌బిఐ కార్డ్స్‌లో 22 వెరసి మొత్తం 78 మంది ఎంపిక అయ్యారు. ఎంపికైన వారికి సత్యం ఫౌండేషన్ ఛైర్మన్ వాసంశెట్టి సత్యం, కంపెనీ ప్రతినిధుల సమక్షంలో నియామక పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో కంపెనీ ప్రతినిధులు హర్ష, దుర్గప్రసాద్, తేజ, సతీష్, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

కిషోర్‌ను సత్కరించిన ఎంఎల్‌సి తోట

ప్రజాశక్తి - ఉప్పలగుప్తం

వైసిపి బూత్ కమిటీ జిల్లా అధ్యక్షులుగా నియమితులైన మండలంలోని చీకట్లపాలెంకు చెందిన చీకట్ల కిషోర్‌ను ఎంఎల్‌సి తోట త్రిమూర్తులు సత్కరించారు. సోమవారం రామచంద్రపురంలో ఎంఎల్‌సిని కిషోర్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కిషోర్‌ను ఆయన సత్కరించారు. వైసిపి బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైసిపి ఐటి విభాగం జిల్లా అధ్యక్షులు తోరం గౌతం, వైసిపి సీనియర్ నాయకులు మట్టపర్తి నాగేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

కార్టూ'నిజం'



ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి : కలెక్టర్

ప్రజాశక్తి - అమలాపురం

అర్జీదారుల నుంచి వచ్చిన సమస్యల పరిష్కారానికి ప్రత్యేక కృషి చేయాలని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన పిజిఆర్ఎస్ కార్యక్రమంలో డిఆర్ఒ రాజకుమారి, డ్వామా పీడీ ఎస్.మధుసూదన్, ఎఒ కాశీవిశ్వేశ్వరరావు, ఎస్‌డిసి కృష్ణమూర్తి, డిఎల్‌డిఒ రాజేశ్వరరావులతో కలిసి కలెక్టర్ ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్జీదారుల సమస్యలపై అధికారులు సానుకూలంగా స్పందించాలని సూచించారు. ప్రతి అర్జీని ప్రాథమికంగా క్షుణ్ణంగా పరిశీలించి క్షేత్రస్థాయిలో విచారిస్తూ అర్జీదారుని సంతృప్తే ధ్యేయంగా పరిష్కార మార్గాలను చూపాలని ఆయన స్పష్టం చేశారు. పిజిఆర్ఎస్‌లో నమోదవుతున్న అర్జీలకు నిర్ణీత గడువులోగా పరిష్కారం చూపాలన్నారు. అర్జీలు ఏ స్థాయిలోనూ పెండింగ్‌లో ఉండరాదన్నారు. సమస్య పరిష్కారం అవుతుందనే నమ్మకాన్ని అర్జీదారులలో కలిగించాలన్నారు. అర్హతను పరిశీంచాలని, అనర్హత ఉంటే తగిన కారణాలను అర్జీదారునికి వివరిస్తూ ఎండార్‌మెంట్ ఇవ్వాలని ఆదేశించారు. పరిష్కారమైన అర్జీదారులతో ఐవిఆర్ఎస్ ద్వారా ఉన్నతాధికారులు వారి సంతృప్తి స్థాయిని తెలుసుకోవడం జరుగుతుందన్నారు. ఫిర్యాదుదారుల విజ్ఞప్తులను అవసరమైతే సంబంధిత అధికారులు క్షేత్ర స్థాయిలో స్వయంగా వెళ్లి క్షుణ్ణంగా పరిశీలించి పారదర్శకంగా విచారణ చేయాలన్నారు. తొలుత గతంలో పిజిఆర్ఎస్‌కు వచ్చిన దరఖాస్తులపై సంబంధిత శాఖల అధికారులతో సమీక్షించారు. ఈ కార్యక్రమంలో పంచాయితీరాజ్ ఎస్ఇ పి.రామకృష్ణారెడ్డి, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఇ.సిహెచ్ ఎన్‌వి.కృష్ణారెడ్డి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి బోసుబాబు, ఎల్‌డిఎం కేశవ వర్మ, ఎఎస్ఒ శరత్, సహాయ పౌరసర ఫరాల మేనేజర్ నాగేశ్వరరావు, వికాస జిఎం జి.రమేష్, అధికారులు పాల్గొన్నారు.



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ మహేష్‌కుమార్

యోగాంధ్రా కార్యక్రమంలో ఆసనాలు వేస్తున్న కలెక్టర్ మహేష్‌కుమార్

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం : కలెక్టర్

ప్రజాశక్తి - ఆత్రేయపురం

యోగాతో సంపూర్ణ ఆరోగ్యాన్ని సొంతం చేసుకోవచ్చునని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ అన్నారు. సోమవారం వాడపల్లి వెంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో రాష్ట్రస్థాయి టూరిజం డెస్టినేషన్ యోగాబ్యాసనాల కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో కలెక్టర్‌తోపాటు, ఎంఎల్ఎ బండారు సత్యానందరావు, అధికారులు పాల్గొని యోగాసనాలు వేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి ఆసనంతో ప్రత్యేక ప్రయోజనాలున్నాయని, ఆరోగ్యకర సమాజ నిర్మాణంలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. రోజులో కొంత సమయాన్ని తప్పనిసరిగా యోగాకు కేటాయించాలనీ సూచించారు. ఎంఎల్ఎ సత్యానందరావు మాట్లాడారు. అనంతరం వాడపల్లిలో జల వనరుల శాఖ ఆధ్వర్యంలో సైఫాన్ వంతెన నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఒ రాజకుమారి, ఆర్‌డిఒ టి.శ్రీకర్, ఆలయ ఇఒ చక్రధరరావు, తహశీల్దార్ రాజేశ్వరరావు, ఎంపిడిఒ వెంకటరామన్, ఎంఇఒ ఆలయ సిబ్బంది, ఆయుష్ వైద్యాధికారి కె.విజయ్‌కుమారి పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

మద్యం మత్తులో వ్యక్తి దారుణ హత్య

ప్రజాశక్తి - పెద్దాపురం

మద్యం మత్తులో జరిగిన వివాదం ఒక వ్యక్తి దారుణ హత్యకు దారి తీసిన సంఘటన సోమవారం రాత్రి స్థానిక కట్టమూరు పుంత రహదారిలో చోటు చేసుకుంది. పెద్దాపురం నుంచి కట్టమూరు వెళ్లే పుంత రహదారిలో కొందరు వ్యక్తులు సోమవారం రాత్రి మద్యం సేవిస్తూ గొడవ పడ్డారు. ఈ వివాదం ముదిరి ఘర్షణకు దారి తీసింది. ఈ ఘర్షణలో కిర్లంపూడి మండలం గోనేడ గ్రామానికి చెందిన జానకి శ్రీనివాస్ (30)పై బీరు బాటిల్‌తో దాడికి పాల్పడ్డారు. ఈ దాడిలో శ్రీనివాస్ మరణించాడు. సమాచారం అందిన వెంటనే సిఐ విజయ్ శంకర్, ఎస్ఐ వి.మౌనిక సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. ఈ సంఘటనపై చుట్టుపక్కల వారిని విచారిస్తున్నారు.

110 కేజీల గంజాయి పట్టివేత

ప్రజాశక్తి - జగ్గంపేట

ఏజెన్సీలోని సీలేరు ప్రాంతం నుండి తమిళనాడుకు తరలిస్తున్న 110 కేజీల గంజాయిని గండేపల్లి పోలీసులు పట్టుకున్నట్లు పెద్దాపురం డిఎస్‌పి శ్రీహరి రాజు తెలిపారు. సోమవారం స్థానిక సర్కిల్ కార్యాలయంలో ఆయన మీడియా సమావేశంలో వివరాలను వెల్లడించారు. తమిళనాడుకు ఒక కార్‌లో నలుగురు వ్యక్తులు 110. 640 కేజీల గంజాయిని 50 ప్యాకెట్లలో తరలిస్తుండగా గండేపల్లి వద్ద ఎస్ఐ శివ నాగబాబు అతని సిబ్బంది పట్టుకున్నారన్నారు. వారి వద్ద రూ.3500 నగదు, నాలుగు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకుని కారును సీజ్ చేసినట్లు తెలిపారు.

బెల్లపు ఊట ధ్వంసం

ప్రజాశక్తి - యు.కొత్తపల్లి

సారా తయారీ కోసం నిల్వ ఉంచిన 400 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్లు కొత్తపల్లి ఎస్ఐ వెంకటేష్ తెలిపారు. ఎస్ఇజెడ్ గ్రామ శివారు జీడితోటలో ఉన్న సారా తయారీకి డ్రమ్ముల్లో దాచి ఉంచిన 400 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసి కేసు నమోదు చేశామని, ఒకరిని అదుపులోకి తీసుకున్నామని తెలిపారు.

సారా కేసులో వ్యక్తి అరెస్టు

ప్రజాశక్తి - దేవరపల్లి

మండలంలోని కృష్ణంపాలెంలో ఎక్సైజ్ అధికారులు సోమవారం దాడులు నిర్వహించారు. సారాను విక్రయిస్తున్న కడలి శ్రీనివాసును అరెస్టు చేశారు. అతని నుంచి 5లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేశామని ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ బి.శ్రీనివాసరావు తెలిపారు ఈ దాడుల్లో ప్రోహిబిషన్ అండ్ ఎక్సైజ్ సబ్ ఇన్‌స్పెక్టర్, సిబ్బంది పాల్గొన్నారు.

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వైద్య సిబ్బంది

క్షయపై అవగాహనా ర్యాలీ

ప్రజాశక్తి - కపిలేశ్వరపురం

మండలంలోని అంగర పిహెచ్‌సి పరిధిలోని పడమర ఖండ్రికలో పిహెచ్‌సి వైద్యాధికారిణి డాక్టర్ రత్నకుమారి ఆధ్వర్యంలో సోమవారం క్షయ వ్యాధిపై అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టిబి ఫ్రీ ఇండియాపై ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా డాక్టర్ శిరీష టిబి వ్యాధి లక్షణాలను వివరించారు. ఆదిలోనే గుర్తించి తగు పరీక్షలు, అవసరమైన వారికి ఎక్స్ రే పరీక్ష చేయించుకుని వ్యాధి నిర్ధారణ అయితే ఉచితంగా చికిత్స అందించబడుతుందన్నారు. తద్వారా వ్యాధిని పూర్తిగా నిర్మూలించవచ్చని అన్నారు. ఈనెల 30వ తేదీ వరకు ప్రతి గ్రామంలో టిబి ముక్త భారత అభియాన్‌పై అవగాహన శిబిరాలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిహెచ్ఇఒ జె.మల్లికార్జునుడు, హెల్త్ ఎడ్యుకేటర్ బి.రామారావు, ఎస్‌టిఎస్.రమణ, ఎంఎల్‌హెచ్ పి.దేవి, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

జొన్నాడ సెంటర్‌లో విధులు నిర్వహిస్తున్న పోలీసులు

నూతన వాహన చట్ట ప్రకారం చర్యలు

ప్రజాశక్తి - ఆలమూరు

ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన వాహన చట్టం ప్రకారం నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని రావులపాలెం రూరల్ సిఐ సిహెచ్.విద్యాసాగర్ హెచ్చరించారు. సోమవారం జొన్నాడ సెంటర్‌లో వాహన తనిఖీలు నిర్వహించారు. పరిమితికి మించి లోడ్‌తో వస్తున్న వాహనానికి రూ.20 వేలు జరిమానా విధించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనదారులు అందరూ డ్రైవింగ్ లైసెన్సులను, ఇన్సూరెన్స్ కలిగి ఉండేలా చూసుకోవాలన్నారు. ద్విచక్ర వాహన దారులు హెల్మెట్‌లను తప్పక ధరించాలన్నారు. అతిక్రమించిన వారిపై నూతన వాహన చట్టం ప్రకారం జరిమానాలు విధిస్తామని హెచ్చరించారు.

తల్లికి వందనం అమలు అభినందనీయం

ప్రజాశక్తి - కొత్తపేట

ఇచ్చిన మాట ప్రకారం తల్లికి వందనం అమలు చేయడం అభినందనీయమని టిడిపి సీనియర్ నాయకులు గుబ్బల మూర్తి సోమవారం ఒక ప్రకటనలో అన్నారు. చదువుకునే విద్యార్థులు ఎంతమంది ఉంటే అంతమందికి తల్లికి వందనం ఇస్తామని అన్నారు. సమాజంలో విద్యకు ప్రాముఖ్యత పెరిగిందని, ఆర్థిక పరిస్థితులు ఉన్న లేకపోయినా పిల్లలను బాగా చదివించాలని తల్లిదండ్రులు ఆశిస్తున్నారని అన్నారు.

డయేరియాపై అప్రమత్తత అవసరం

ప్రజాశక్తి - అమలాపురం

అతిసార వ్యాధి పట్ల వైద్య శాఖ అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో అతిసార వ్యాధిపై ముద్రించిన ప్రచార కరపత్రాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న 2 నెలల పాటు గ్రామాల్లో స్టాప్ డయేరియా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని ఆదేశించారు. ఈనెల 16 నుంచి ప్రతి ఇంటికి 2 ఒఆర్‌ఎస్ ప్యాకెట్లు 14 జింక్ మాత్రలు ఇవ్వడం జరుగుతుందన్నారు. ప్రతి పిహెచ్‌సి, సిహెచ్‌సి, హెల్త్ సెంటర్లు, అంగన్‌వాడీ కేంద్రాలల్లో ఒఆర్‌ఎస్ ప్యాకెట్లు, జింక్ మాత్రలు సమృద్ధిగా అందుబాటులో ఉంచామన్నారు. అతిసార వ్యాధితో బాధపడేవారు ఈ యొక్క కేంద్రాలను సందర్శించి ఒఆర్‌ఎస్, జింక్ మాత్రలు వాడాలన్నారు. మైల్డ్, సివియర్, సీరియస్ కేసులకు సంబంధించి ఎబిసి ప్లాన్ ఉందని, సివియర్ సీరియస్ కేసులు ఆసుపత్రులలో వైద్య సేవలు పొందాలన్నారు. హెల్త్ వెల్నెస్ సెంటర్ల పరిధిలోని అన్ని పాఠశాలల్లోని బడి పిల్లలకు హ్యాండ్‌వాష్, పరిశుభ్రత గురించి అవ గాహన కల్పిస్తారన్నారు. అతిసార ప్రబలకుండా చర్యలు తీసుకోవాలన్నారు. నీటి యొక్క నాణ్యతను పరీక్షించుట, నీటిలో నాణ్యత లోపించిన యెడల పంచాయతీ సిబ్బందితో క్లోరినేషన్ చేయించాలన్నారు. డెంగీ, మలేరియా వ్యాధుల ప్రబలకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు డిఎంహెచ్ఒ సిహెచ్‌వి.భరతలక్ష్మి, జిల్లా ఇమ్యూనికేషన్ అధికారి బివివి.సత్యనారాయణ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

స్టాప్ డయేరియా క్యాంపెయిన్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ మహేష్‌కుమార్

అధికారులు బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి - యంత్రాంగం

జిల్లాలో వివిధ ప్రభుత్వ శాఖల ఉద్యోగులకు బదిలీలు జరిగాయి. సోమవారం బదిలీల్లో భాగంగా పలువురు అధికారులు ఆయా శాఖల వారీ ఉద్యోగ బాధ్యతలను స్వీకరించారు.

అమలాపురం అమలాపురం మున్సిపల్ కమిషనర్‌గా వి.నిర్మల్ కుమార్ బాధ్యతలు చేపట్టారు. అమరావతి డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ ఛీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్‌గా విధులు నిర్వహించిన నిర్మల్‌కుమార్ ఇక్కడకు బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా మున్సిపల్ అధికారులు, సిబ్బంది ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

నిర్మల్‌కుమార్

మామిడికుదురు మండల తహశీల్దార్‌గా పి.సునీల్‌కుమార్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. కాట్రేనికోన తహశీల్దార్‌గా పని చేస్తున్న ఆయన సాధారణ బదిలీల్లో భాగంగా ఇక్కడకు వచ్చారు. ఈ సందర్భంగా ఆయనకు డిటి శరణ్య, కార్యాలయ ఉద్యోగులు, విఆర్ఒలు శుభాకాంక్షలు తెలిపారు.

సునీల్‌కుమార్

అలాగే మండల వ్యవసాయ అధికారిగా ఎన్‌వివి.సత్యనారాయణ బాధ్యతలు స్వీకరించారు. అల్లవరం వ్యవసాయాధికారిగా విధులు నిర్వహిస్తూ బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఆయనకు కార్యాలయ ఉద్యోగులు శుభాకాంక్షలు తెలిపారు. ఇక్కడ ఎఒగా విధులు నిర్వహించిన బి.మృదుల బదిలీపై కాట్రేనికోన వెళ్లారు. నిత్యం రైతులకు అందుబాటులో ఉంటానని ఎఒ తెలిపారు.

రాజోలు మండల తహశీల్దార్‌గా సిహెచ్.భాస్కర్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు రాజోలు తహశీల్దార్‌గా పనిచేసిన ఎస్ఎస్ఎస్.ప్రసాద్ పదవీవిరమణ చేశారు. ఈ నేపథ్యంలో సఖినేటిపల్లి మండల డిప్యూటీ తహశీల్దార్‌గా విధులు నిర్వర్తిస్తున్న భాస్కర్‌ను పదోన్నతిపై రాజోలు తహశీల్దార్‌గా ప్రభుత్వం నియమించింది. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ మండలంలోని రెవెన్యూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, కుల, ఆదాయ ధ్రువపత్రాలను అర్హులైన ప్రతి ఒక్కరికి చేరువచేస్తానని తెలిపారు. అనంతరం రెవెన్యూ సిబ్బందితో సమావేశమయ్యారు. అందరూ తమ విధులు పట్ల బాధ్యతగా వ్యవహరిస్తూ, ప్రజలకు అందుబాటులో ఉండి ప్రజా సమస్యలను పరిష్కరించాలని సూచించారు.

సిహెచ్.భాస్కర్

ముమ్మిడివరం మండల పరిషత్ కార్యాలయ పరిపాలన అధికారిగా ఎంఎస్‌విఎస్. శేష గిరిరావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. తుని మండల పరిషత్ కార్యాలయం నుంచి ఆయన బదిలీపై వచ్చారు. ఇప్పటివరకు ఇక్కడ పనిచేసిన తులసికృష్ణ ఉప్పలగుప్తం మండల పరిషత్ కార్యాలయానికి బదిలీ అయ్యారు. ఎఒ కు కార్యాలయ సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం శేషగిరిరావు ఎంపిపి కొలా గంగాభవాని, ఎంపిడిఒ టి.శ్రీవేంకటచార్యాను మర్యాదపూర్వకంగా కలిశారు.

ఎఒ శేషగిరిరావు

కపిలేశ్వరపురం మండల వ్యవసాయ అధికారిగా బలుసు రవి బాధ్యతలు స్వీకరించారు. కె.గంగవరం మండల ఎఒగా పని చేస్తూ బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇప్పటివరకు పని చేసిన ఎఒ రమేష్‌కుమార్ రాయవరం బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా పలువురు ఆయనకు అభినందనలు తెలిపారు

ఎఒ బలుసు రవి

కాట్రేనికోన మండల మత్స్యశాఖ అభివృద్ధి అధికారిగా విళ్ళ రమణరావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన గతంలో ద్వారపూడి మండలంలో పనిచేశారు.. సాధారణ బదిలీల్లో భాగంగా కాట్రేనికోనకు వచ్చారు. ఆయనను మత్స్యశాఖ సిబ్బంది కలిసి అభినందనలు తెలిపారు.

రమణారావు

తల్లికి వందనంపై వైసిపి తప్పుడు ప్రచారం

ప్రజాశక్తి - మండపేట

ప్రతీ తల్లి సంతోషంగా ఉండేలా తల్లికి వందనం పథకాన్ని ప్రభుత్వం అమలు చేస్తుంటే, అది చూసి ఓర్వలేని జగన్మోహన్ రెడ్డి అండ్ కో తప్పుడు ప్రచారం చేస్తున్నారని రాష్ట్ర అంచనాల కమిటీ ఛైర్మన్, ఎంఎల్ఎ వేగుళ్ల జోగేశ్వరరావు మండిపడ్డారు. సోమవారం స్థానిక టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇంట్లో ఎంతమంది విద్యార్థులు ఉంటే అంతమందికి తల్లికి వందనం ఇస్తుంటే వైసిపి నేతలు తప్పుడు ప్రచారం చేస్తూ విద్యార్థులకు తీరని ద్రోహం చేస్తున్నారని దుయ్యబట్టారు. రూ.2 వేలు లోకేష్ జేబుల్లోకి పోయాయంటూ వైసిపి నేతలు దిగజారి ఆరోపణలు చేస్తున్నారని, దమ్ముంటే రుజువు చేయాలని సవాల్ చేశారు. ఆధారాలు లేని ఆరోపణలు చేయటమే వైసిపి నేతల పని అని విమర్శించారు. కనీసం తల్లికి కూడా గౌరవం ఇవ్వలేని జగన్‌రెడ్డి నేడు తల్లికి వందనం గురించి మాట్లాడటం సిగ్గుచేటన్నారు. 67 లక్షల మంది విద్యార్థుల తల్లుల ఖాతాల్లో నగదు జమ చేస్తున్నామన్నారు. చౌకబారు ఆరోపణలు జగన్‌రెడ్డి మానుకుంటే మంచిదని సలహా ఇచ్చారు. ఈ సమావేశంలో తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి రిమ్మలపూడి వేణుగోపాలదొర, అమలాపురం పార్లమెంట్ ఉపాధ్యక్షులు వైఆర్‌కె.పరమహంస, రాయవరం మండల టిడిపి అధ్యక్షులు కొప్పిశెట్టి మాధవరావు, నాయకులు మల్లిడి సూర్రెడ్డి, అనసూరి శ్రీను, నల్లమిల్లి వెంకన్నబాబు పాల్గొన్నారు.

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎంఎల్ఎ వేగుళ్ల

విద్యా మిత్ర కిట్లు పంపిణీ

ప్రజాశక్తి - అమలాపురం, ఆలమూరు

స్థానిక 15వ వార్డులోని గోపాలకృష్ణ గోఖలే పురపాలక ఆదర్శ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు విద్యార్థి మిత్ర కిట్లును కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్య పట్ల ప్రత్యేక శ్రద్ధ పెట్టి పలు సంస్కరణలను అమల్లోకి తెచ్చిందని అన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మనబడి మన భవిష్యత్తు కార్యక్రమంలో భాగంగా పాఠశాల ఆవరణలో చేపట్టిన నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డిఇఒ షేక్ సలీం భాష, సర్వ శిక్ష ఎపిసి జి.మమ్మీ, పాఠశాల హెచ్ఎం సాయిశ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు. అలాగే ఆలమూరు మండలంలోని జొన్నాడలో జడ్‌పి ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు విద్యార్థి మిత్ర కిట్లు పంపిణీ చేశారు. సోమవారం ఎస్ఎంసి ఛైర్మన్ మెర్ల శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో హెచ్ఎం అనంత శ్రీనివాస్ ఆధ్వర్యంలో గ్రామ పెద్దలు విద్యార్థులకు కిట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కట్టా శ్రీనివాస్, ద్వారంపూడి నాగేంద్ర సత్యనారాయణరెడ్డి, తాడి శ్రీనివాస్‌రెడ్డి, గొడవర్తి దుర్గాప్రసాద్, తాడి మెహర్ ఆదిత్యరెడ్డి, నల్లిమిల్లి రామారెడ్డి, జనిపల్లి సుబ్రహ్మణ్యం, చింతలపూడి శ్రీనివాస్, చెల్లె ప్రేమ్ కుమార్, మల్లిడి సూర్యనారాయణరెడ్డి, పోలినాటి కుమార్‌బాబు, యాళ్ళ వినోద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అమలాపురంలో కిట్లు పంపిణీ చేస్తున్న కలెక్టర్

ఏటిగట్టు రహదారిపై వాహనాలు నిలిపివేత

ప్రజాశక్తి - కపిలేశ్వరపురం

మండలంలోని జొన్నాడ - కోటిపల్లి ఏటిగట్టు రహదారిలో సోమవారం కపిలేశ్వరపురం శివారు సత్యనారాయణపురం వద్ద ఏటిగట్టుపై వాహనాలను గ్రామస్తులు నిలిపివేశారు. ఇసుక వాహనాలతో రహదారి ఛిద్రమై అధ్వాన్న స్థితికి చేరుకుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ రహదారిలో అనేక చోట్ల దిగబడి పోవడంతో ప్రతినిత్యం ప్రమాదాలకు నిలయంగా మారిందన్నారు. దీనిపై ఇసుక ర్యాంపు నిర్వాహకులు పట్టించుకోకపోవడం అసహనం వ్యక్తం చేశారు. గత కొద్ది రోజులుగా ర్యాంపు నుంచి తడి ఇసుకను లారీల ద్వారా తరలించడంతో ఆ నీరు వల్ల రహదారి తడిసి చిత్తడి చిత్తడిగా మారిందని దీంతో అనేక ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో వాహనదారులు ప్రజలు అనేక ఇబ్బందులు పడ్డారు. సమస్యను వెంటనే పరిష్కరించాలని అధికారులను కోరారు.

వాహనాలను అడ్డుకుంటున్న గ్రామస్తులు

దుర్గారావును సత్కరిస్తున్న ఎంఆర్‌పిఎస్ నాయకులు

ఎంఆర్‌పిఎస్ నూతన కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి - ఉప్పలగుప్తం

మండలంలోని గొల్లవిల్లిలో మండల ఎంపిఆర్‌పిఎస్ సమావేశం సోమవారం జరిగింది. ఈ సందర్భంగా ఎంఆర్‌పిఎస్ మండల కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా సత్తాల దుర్గారావు, గౌరవ అధ్యక్షులుగా పలివెల రాంబాబు, ఉపాధ్యక్షులుగా ఉందుర్తి శ్రీను, ప్రధాన కార్యదర్శిగా తొత్తరమూడి దుర్గారావు, సహాయ కార్యదర్శిగా సవరపు సుబ్రహ్మణ్యం, ప్రచార కార్యదర్శిగా కొడమంచిలి సర్వేశ్వరరావు, ఇతర కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అలాగే ఎంఎస్‌ఎఫ్ మండల కమిటీ అధ్యక్షులుగా ఉందుర్తి సంజీవ్, ఎంఎస్‌పి మండల అధ్యక్షులుగా తొత్తరమూడి విజయ్‌లను ఎన్నుకున్నారు. వచ్చే నెల 7వ తేదీన జరిగే ఎంఆర్‌పిఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని జయప్రదం చేయాలని నాయకులు కోరారు. ఈ సమావేశంలో జిల్లా ఇన్‌ఛార్జ్ కెవి.మధు కో ఇన్‌ఛార్జ్ సూరి, జిల్లా అధ్యక్షులు సవరపు భైరంమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

ఎంపి హరీష్‌కు ఘన స్వాగతం

ప్రజాశక్తి - అమలాపురం

పాకిస్థాన్ ఉగ్రవాదుల దాడి, ఆపరేషన్ సింధూర్ ఆవశ్యకతపై పార్లమెంటరీ అఖిలపక్ష బృంద సభ్యునిగా విదేశాలకు వెళ్లి సోమవారం తిరిగి వచ్చిన ఎంపి హరీష్ మాధూర్‌కు కూటమి నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. నల్లవంతెన సమీపంలోని బాలయోగి ఘాట్‌లో లోక్ సభ మాజీ స్పీకర్ జిఎంసి బాలయోగి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

ఎంపికి గజమాలతో స్వాగతం పలుకుతున్న అభిమానులు

వయో వృద్ధుల చట్టాలపై సదస్సు

ప్రజాశక్తి - ముమ్మిడివరం

రాజ్యాంగం వృద్ధుల కోసం ఎన్నో చట్టాలను కల్పించిందని, ఆ చట్టాలను సద్వినియోగం చేసుకోవాలని మండల లీగల్ సర్వీసెస్ కమిటి ఛైర్మన్, జూనియర్ సివిల్ జడ్జి మహమ్మద్ రహంతుల్లా అన్నారు. సోమవారం స్థానిక కోర్టు ప్రాంగణంలో ప్రపంచ వయో వృద్ధుల సంక్షేమ దినోత్సవాన్ని పురస్కరించుకుని న్యాయ విజ్ఞాన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వృద్ధుల రక్షణకు ఎన్నో చట్టాలు ఉన్నాయని, వారి హక్కులకు భంగం కలిగిన పక్షంలో కోర్టులను ఆశ్రయించవచ్చన్నారు. వయోవృద్ధుల న్యాయవాదిని ఏర్పాటు చేసుకోలేని పరిస్థితిలో ఉంటే వారికి న్యాయ స్థానమే న్యాయవాదిని ఏర్పాటు చేస్తుందని సూచించారు. వయో వృద్ధులను కాపాడుకోవలసిన భాధ్యత అందరిపైన ఉందని వివరించారు. ఈ సదస్సులో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వడ్డి నాగేశ్వరావు, ఎజిపి కాశి సిద్ధార్థకుమార్, ప్యానల్ లాయర్లు కెఆర్‌కె.రాజు, దాసరి సత్యనారాయణ, ఇఎస్ఎన్.బాబు, టి.నాగరాజారావు, జి.రామారావు, ఎండి.ఆలీహసన్, కెఎల్‌వి.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సదస్సులో మాట్లాడుతున్న న్యాయమూర్తి మహమ్మద్ రహంతుల్లా

మహారాజశ్రీ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్‌జడ్జి వారి కోర్టు
రాజమహేంద్రవరం
O.S. No. 105/2024

Between:-
State Bank of India, Rep by its Branch Manager, Divancheruru Branch, Rajamahendravaram Rural ...Plaintiff

And

Jami Murali Mohan Son of Rama Rao, Hindu Aged 44 years, LDC Employee,Primary Health Center, Maredumilli and residing at Flat No.101, Srvya Enclave,Bijapuri Township, Divancheruvu,Palacherla. ...Deffendant

పై నంబరు దావాలో ప్రతివాది అయిన మీకు కోర్టు ద్వారా ఎన్నిసార్లు సమన్లు/నోటీసులు పంపినా మీరు వాటిని తీసుకోకుండ ఉద్దేశ్యపూర్వకంగా త్రిప్పివేయుచున్నారు. కావున **ది.23-06-2025 సం॥రం తేదీ ఉదయం 10.30 ని॥లకు** మీరు స్వయంగా గాని లేదా ప్లీడరు ద్వారా గాని పై కోర్టు వారి ఎదుట హాజరు అయ్యి సదరు పై దావాలో మీ ఆక్షేపణలను తెలుపుకొనవలెను. లేనియెడల సదరు దావాను మీకు పరోక్షముగా తీర్మానించబడునని ఇందుమూలముగా తెలియజేయడమైనది .

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

పుప్రేవు ఉపేంద్రకుమార్
అడ్వకేట్
రాజమండ్రి
రాజమండ్రి
ది.16-6-2025

శ్రీ సీతారామ స్వామి వారి దేవస్థానం
పోలవరం గ్రామం, పోలవరం మండలం, ఏలూరు జిల్లా
భూముల సేద్యమునకు కౌలు హక్కునకు బహిరంగ వేలం ప్రకటన

ఏలూరు జిల్లా, పోలవరం మండలం, గూటాల గ్రామములో వేంచేసియున్న శ్రీ సీతారామ స్వామి వారి దేవస్థానం, సంపూర్ణ హక్కు భుక్తములో గల ఈదిగువ నుదహరించిన భూములను 2025-2026 నుండి 2027-2028 సంవత్సరము వరకు అనగా 3 సంవత్సరముల కాలమునకు కౌలుకు సేద్యము చేసు కొనుహక్కునకు దేవదాయ ధర్మదాయ శాఖ చట్టం 30/1987 జి.ఓ.ఎం.ఎస్.నెం.397 రెవెన్యూ (ఎండోమెంట్స్-1) శాఖ, తేదీ.11.03.2001 మరియు జి.ఓ.ఎం.ఎస్.నెం. 425 (ఎండోమెంట్స్-1) శాఖ, తేదీ.09.11.2015 ప్రకారం దేవదాయ ధర్మదాయ శాఖ అధికారుల సమక్షంలో యీ దిగువ తెలిపిన తేదీలలో బహిరంగ వేలం పాట నిర్వహించబడును. కావున ఆసక్తి గలవారు ఈక్రింది షరతులకు లోబడి వేలంపాటలో పాల్గొనవలసినదిగా కోరుచున్నాము.

శ్రీ సీతారామ స్వామి వారి దేవస్థానం, పోలవరం గ్రామం.

వ. నెం.	భూమి యున్న గ్రామం, మరియు మండలం	సర్వే నెం.	విస్తీర్ణం య.సెం.	ధరావత్తు	బహిరంగవేలం జరుపు ప్రదేశం, తేదీ మరియు సమయము
1.	పురుషోత్తపట్నం గ్రామం సీతానగరం మండలం	91/1, 109/1	4.21	రూ.10,000	పురుషోత్తపట్నం గ్రామ పంచాయితీ కార్యాలయం వద్ద ది.03.07.2025 ఉదయం గం.10.00 లకు
		99/2	1.05	రూ.2,000	

వేలంపాట షరతులు :

1. ఈ వేలం పాట సదరు దేవస్థానం కార్యనిర్వహణాధికారి వారిచే ఉన్నతాధికారుల ఉత్తర్వులకు లోబడి నిర్వహించబడుచున్నది.
2. దేవస్థానమునకు ఏవిధమైన బకాయిలు వున్నవారుగానీ, దేవస్థానముతో ఎట్టి లావాదేవీలు వున్నవారుగానీ పాటలో పాల్గొనరాదు. పాట పాడుటకు తగిన అర్హత లేనివారిని పాటలో పాల్గొనకుండా చేయుటకు కార్యనిర్వహణాధికారి వారికి అధికారము కలదు.
3. అంగీకరింపబడిన పాటదారు పాటకొట్టివేసిన వెంటనే ఒక సం.రం శిస్తుసొమ్ము చెల్లించు నిర్ణయం.
4. ఇతర వివరములకు శ్రీ స్వామి వారి దేవస్థానం కార్యాలయము పనివేళలలో సంప్రదించవలెను.

ది.16.06.2025, పోలవరం
కార్యనిర్వాహణాధికారి, సెల్ నెం. 99486 11144

రహదారిని పరిశీలిస్తున్న ఎంఎల్ఎ బండారు

రహదారుల అభివృద్ధికి ప్రాధాన్యత

ప్రజాశక్తి - కొత్తపేట

వైసిపి పాలనలో నిర్లక్ష్యానికి గురైన రహదారులను అభివృద్ధి చేసేందుకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు ఎంఎల్ఎ బండారు సత్యానందరావు అన్నారు. సోమవారం కొత్తపేట నుంచి వాడపాలెం వరకూ రూ.3కోట్లతో నిర్మించే రహదారిని పంచాయతీరాజ్ శాఖ అధికారులు పి.రామకృష్ణారెడ్డి, ఎవి.సూర్యనారాయణలతో కలిసి ఆయన పరిశీలించారు. ఎన్ఆర్ఇజిఎస్ నిధులతో నిర్మించనున్న ఈ రహదారికి నిధులు మంజూరు అయ్యాయని, అత్యంత పారదర్శకంగా రహదారి నిర్మాణ పనులను చేపట్టి, త్వరితగతిన నిర్మాణాన్ని పూర్తిచేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ రాంబాబు, జెఇ వీరభద్రరావు, త్సమా బాబు, బూసి జయలక్ష్మి భాస్కరరావు, తదితరులు పాల్గొన్నారు.

సతీష్‌ను సత్కరిస్తున్న అభిమానులు

టిడిపి పరిశీలకునిగా సతీష్ నియామకం

ప్రజాశక్తి - ఆలమూరు

పట్టణ టిడిపి సంస్థాగత ఎన్నికల పరిశీలకులుగా ఆలమూరుకు చెందిన సొసైటీ మాజీ ఛైర్మన్ వంటిపల్లి సతీష్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పార్టీ అధిష్టానం నా మీద ఉంచిన నమ్మకాన్ని వమ్ము కాకుండా చూసుకుంటానని అన్నారు. సతీష్‌కు పలువురు నాయకులు, కార్యకర్తలు, అభినందనలు తెలిపారు.

Notice
IN THE COURT OF THE HON'BLE V ADDL.DIST.JUDGE::GUNTUR
M.V.O.P.No:1268/ 2023

Between:
Munnangi Saraswathi & Others ...... Petitioners
And
A.Veerabhadram & Others ... Respondents

To,
R-2: Aakula Parasuramudu,
S/o. Kannayya, R/o.Door No. 1-75,
Ganapathy Peta,Pedabrahmadevem,
Samalkota, East Godavari-533434
(Owner Of The Eicher Lorry Bearing No. Ap 39 V 88491)

పై నెంబరు O.P.ని పిటీషనర్లు యాక్సిడెంటుకి నష్టపరిహారము కోరుచూ దాఖలు చేయగా సదరు పిటీషన్ లో 2వ రెస్పాండెంట్ అయిన మీరు కోర్టు నోటీసులు తీసుకొనక కాలయాపన చేయుచున్నందున ఈ వార్త పత్రిక ద్వారా మీకు తెలియజేయమని శ్రీ కోర్టు వారు ది:30-06-2025 కి వాయిదా వేసినారు.కావున ఆ రోజున ఉ.గం. 10-30 ని.లకు పై కోర్టు వారి ఎదుట స్వయముగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని హాజరై మీకు గల ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేనిచో శ్రీ కోర్టు వారిచే మీ పరోక్షమున విచారించి తీర్మానించబడును.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

వాయిదా తేది:30-06-2025

కొమ్మారెడ్డి రామకృష్ణా రెడ్డి,
పిటీషనర్లు తరపు అడ్వకేట్, గుంటూరు,

ప్రకటన
మహారాజశ్రీ ఏలూరు 7వ అదనపు జిల్లా కోర్టు (Family Court) లో
I.A.No. 143/2025 in O.S.No. 71/2023

Between:
Kusuma Raja Venkata Ramohan ...పిటీషనర్/ప్రతివాది
Vadlamudi Lavanya ...రెస్పాండెంట్/వాది

పై నెంబరులో రెస్పాండెంటు అయిన
వడ్లమూడి లావణ్య
W/o. రవికృష్ణ, D.No: 4-211/12
ధవలేశ్వరం, తూ॥గో॥జిల్లా.

అనువారు ఎన్నిమార్లు నోటీసు పంపినను పుచ్చుకోనందున Substitute of Service ద్వారా పేపరు ప్రకటన ద్వారా నోటీసు ఆర్డరు వేయుచు **ది. 20-06-2025 వ తేదీన** స్వయంగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని హాజరయి తగు సంజాయిషీ యివ్వవలసింది. లేనియడల పరోక్షమున తీర్మానించబడునని యిందుమూలంగా తెలియపరచడమైనది.

వాయిదా : 20-06-2025

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

D.S.V. Manikyala Rao
Advocate
Eluru
Eluru
Date: 16-06-2025
Cell: 94401 11466

ప్రకటన
మహారాజశ్రీ ఏలూరు 7వ అదనపు జిల్లా కోర్టు (Family Court) లో
I.A.No. 144/2025 in O.S.No. 71/2023

Between:
Kusuma Raja Venkata Ramohan ...పిటీషనర్/ప్రతివాది
Vadlamudi Lavanya ...రెస్పాండెంట్/వాది

పై నెంబరులో రెస్పాండెంటు అయిన
వడ్లమూడి లావణ్య
W/o. రవికృష్ణ, D.No: 4-211/12
ధవలేశ్వరం, తూ॥గో॥జిల్లా.

అనువారు ఎన్నిమార్లు నోటీసు పంపినను పుచ్చుకోనందున Substitute of Service ద్వారా పేపరు ప్రకటన ద్వారా నోటీసు ఆర్డరు వేయుచు **ది. 20-06-2025 వ తేదీన** స్వయంగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని హాజరయి తగు సంజాయిషీ యివ్వవలసింది. లేనియడల పరోక్షమున తీర్మానించబడునని యిందుమూలంగా తెలియపరచడమైనది.

వాయిదా : 20-06-2025

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

D.S.V. Manikyala Rao
Advocate
Eluru
Eluru
Date: 16-06-2025
Cell: 94401 11466